పరుగెత్తుకొచ్చింది యామిని. "హరీ అప్ మిస్టర్ నర్సరాజు!........మమ్మీ వొచ్చేస్తోంది.... ప్లీజ్.... డోంట్ లుక్ సోమచ్ అప్‌సెట్!.... సరిగ్గా వుండండి మేష్టారూ.... ఇట్స్ ఆల్ నథింగ్ బట్ ఎ స్వీట్ అండ్ కాజువల్ ఇన్‌స్పిరేషన్!.... లైక్ పెయింటింగ్ ఎ పిక్చర్ ఆర్ స్ట్రెచింగ్ ఎ రాగ; దట్సాల్!.... ఏదో పోగొట్టుకున్నట్టు మొహం పెట్టకండి బాబూ మీకు పుణ్యం వుంటుంది."

తొందర తొందరగా మొహాన ఫ్లవర్‌తో పౌడర్ కొట్టుకుంది. డబ్బీలోంచి రెండు యాలక్కాయలు లవంగాలు తీసి-నోట్లో వేసుకుని అర్జంటుగా నమల సాగింది.

"మమ్మీ రాగానే మమ్మలాగా కూర్చోక; ప్లీజ్ సే సమ్‌తింగ్. లేకపోతే సస్పెక్ట్ చేస్తుంది. నాకు సీన్సంటే కిట్టదు!........ఓ మై గాడ్, వాట్టుడు విత్ దీజ్ రెచెడ్ రికార్డ్స్!"

హాల్లోకొచ్చి సోఫాలో కూర్చున్నాను.

అప్పటికే తెరిచున్న హాలు ద్వారంలోంచి పడమటి గాలిలా ఆకర్షణ వెద జల్లుకుంటూ వచ్చేరు మీనాక్షమ్మగారు.

"మాట్లాడు!" అన్నట్టు సంజ్ఞచేసింది, కిటికీ కర్టెన్‌లోంచి యామిని.

"నమస్కారమండీ. భలే చేశారే, అరుగంటలకి రమ్మని!........ మీ గురించి తొంభై నిముషాలు........ కాదు నైన్టీ ఇయర్స్ నించీ వెయిట్ చేస్తున్నాను!" జోకేసి నేనే నవ్వుకున్నాను. పేలవంగా వచ్చుంటుంది.

"రియల్లీ!" అన్నారు మీనాక్షమ్మగారు; తియ్యటి నవ్వు పారేసి. "ఐమ్ రియల్లీ సారీ.... జస్ట్ వన్‌మోర్ మినిట్........ సే వన్ మోర్ ఇయర్!" అని నవ్వుకుంటూ తన గదిలోకి వెళ్ళిపోయి తలుపేసుకున్నారు.

రికార్డు ప్లేయరు, స్పీకర్సు, రికార్డులు, కచేరీల ఫోటోల ఆల్బమ్, అన్నీ దొంతరపెట్టి ఒక్క చేతిమీద మోసుకొచ్చింది యామిని. హాల్లో ఆ మూల టేబిల్ మీద పెట్టేసి చిందరవందరగా సర్దింది. నేను తన గదిలో మంచంమీద మర్చిపోయిన రుమాలు ఆ టేబిల్ దగ్గిర ఒక కుర్చీవుంటే దాంట్లో పడేసింది. పరుగెత్తుకొని నా దగ్గిరకొచ్చి "థాంక్యూ ఎగెన్. యు డిడిట్ సో వెల్," అని నా బుగ్గ మీద చిన్న ముద్దుపెట్టి తనగదిలోకి పారిపోయింది.

ఏడున్నరకి గాను, గడియారం అరగంట కొట్టింది.

పడమటి గాలి ఇంకా వెచ్చగా వీస్తూనే వుంది. ఇది ఎప్పటికైనా అగుతుందా అని విసుగుపుట్టేస్తోంది.

——



కొయితి అప్పారావు

# ఫూలన్ దేవుడు

నా జీవితం ఎందుకిలా మారిపోయింది! నా బ్రతుకు నేను బ్రతుకుదామన్నా బ్రతకనీయని ఉద్యోగులు.... చెడుముద్రవేసి సంఘంలో చలామణి కాకుండ చేశారు.... ఆ రోజే అనుకుంటా ఆఖరురోజు నేను తృప్తిగా నవ్విన రోజు ఉగాదిరోజు పంతులమ్మగారిచ్చిన ఉగాది పచ్చడి తిన్నరోజు - తీపి పులుపు వగరు చిరుచేదు.

అప్పుడే కేరేజీలు ఎవరివి వారికిచ్చి తిరిగి ఖాళీ గంపతో వచ్చిన భార్య తంగమ్మను చూశాడు దేవుడు.

"చేసుకున్నది మొదలు ఏం సుఖ పడింది! వాళ్ళు తినగా మిగిలిన దాంతో కడుపు నింపుకుని వస్తుంది. రాత్రిపూట అంతంత మాత్రం" అనుకుంటుండగా, "పిల్ల కెట్టాగుందేటి!" అనడిగింది.

"జ్వరం కాల్చేస్తోంది. మాత్ర వేశాను సూదిమందు పడాలి."

"కొనుక్కోలేం-డాకటరికి డబ్బివ్వలేం-పెద్దాసుపత్రే గతి."

"రేపటిదాకా చూద్దాం - ఒల్లంతా మంచినూనె రాయి."

రంగమ్మ చిట్టికి మంచినూనె రాసింది. కారుస్తున్న కన్నీటిని తుడిచింది. పరవా లేదని ధైర్యం చెప్పింది.

"ఆ పెద్ద కేరేజీ బాబుగోర్నడిగి రెండు రూపాయలు తెచ్చినాను. రొట్టి టీ పట్టుకొస్తాను. తిందువు గాని— తగ్గి పోతుంది."

చిట్టి చిరుచీకటిలో తలిదండ్రుల వైపుచూస్తోంది. కళ్ల తిరిగిపోతున్నాయి.

అంతా అయోమయంగా వుంది. భార్యా భర్త లొకరివైపొకరు దీనంగా చూస్తు కున్నారు. రంగమ్మ లేచివెళ్లి టీ రొట్టె పట్టుకువచ్చి చిట్టికి పెట్టింది. చిన్న కుండలో బియ్యం పొంగించి రంగమ్మ "ఆ గదిలో నలుగురు స్టూడెంటు బాబు లకి కేరేజీలు తీసుకు రావాలి. మిగిలిన పాంబడు చారు తీసుకొస్తాను. అంత వరకూ చిట్టిని చూస్తుండు" అని రంగమ్మ పని ముగించుకుని ఇంటికి వచ్చింది. ఇద్దరూ భోజనం చేశారు. చిట్టికి దుప్పటి కప్పి ఇద్దరూ పైనికూర్చున్నారు.

"నా క్యారేజీలతో గడిసిపోతంది నీకు నిలకడగా ఏ సిన్న వుద్యోగమైనా బ్రతికిపోదుం. యీ యెదవ సచ్చినోళ్ళు బతకనియ్యడంలేదు."

"వారానికి రెండు చిల్లర కేసులు— మూడు రూపాయలు నా ఖర్చుకి మిగిలిన మూడు రూపాయలు కోర్టుకి."

"ఇలా గెన్నాళ్లేటి?"

"మనిషిని మనిషిగా బ్రతకనివ్వటం లేదు రంగమ్మా! చెరగని చెడుముద్ర వేశారు. నేను చెయ్యని నేరానికి నే నెందుకు కోర్టుకెల్లాలి? ఎక్కువ కేసులు పట్టుకున్నట్టు నమోదైతే వాళ్లకు ప్రమోషనట! వాళ్ల ప్రమోషన్‌కోసం నాలాంటి వాళ్లం బలైపోవాలన్నమాట! నన్ను వాళ్ల జాబితానుంచి తప్పించెయ్యమన్నాను. ససేమిరా వీల్లేదన్నారు. నోరెత్తి ఎదిరిం చానో పెద్ద కేసుల్లో ఇరికించేస్తారని భయంగా వుంది రంగమ్మా!"


రంగమ్మ భర్తవైపు జాలిగా చూసింది.

"మన బ్రతుకులెలాగూ కూలిబ్రతుకు లైపోయాయి.... చిట్టి - దాని తలి దండ్రులు—మన పిలుపు దానికి కడతారు. ఇలాంటి తలిదండ్రులకు తాను కూతు రుగా పుట్టానని బాధపడటం తప్ప చేసే దేముంది!"

ఆ మాటలకు రంగమ్మ చలించి పోయింది.

"ఆ రోజుల్లో హార్బర్‌లో ఉద్యోగ మైందంటూ పోస్టులో ఆర్డర్లు పంపించా రట! సరియైన అడ్రసులేక అది మన కందకపోవటము నెలరోజులు దాటిం దని నా స్థానంలో మరొకరిని వేసుకో వటం జరిగింది. అదే అప్పుడు చేరిపోతే నీవిలా వుండేదానినా రంగమ్మా! చిట్టిని బడిలో చదివించేవాడిని. సాయంత్రం పూట మంచి బట్టలు కట్టుకుని బీచిలో






కూర్చుని కాసేపైనా ఆనందంగా గడిపే వాళ్లం.... దేశంలో మనలాంటి దుర దృష్టవంతులు కోట్లకొద్దున్నారు.... ఇలాంటి వాళ్ల బ్రతకడంలో అర్థం? ప్రాణంమీది తీపి"........

చిట్టికి జ్వరం తగ్గలేదు. నిద్రమత్తులో ఏవేవో మాటలు.

"నువ్వు సిట్టిని ఆసిపిట్లకి తీసుకెల్లు— నేను కేరేజీలు పట్టుకెల్లాలి. లేకపోతే అందరూ తిట్టుకుంటారు. కేంటీన్‌లో తిండానికి ఆ బాబులగ్గిర డబ్బులుం డవు." అంటూ రంగమ్మ చిట్టికి ధైర్యం చెప్పి తట్ట నెత్తిన పెట్టుకుని బయలు దేరింది.

ఎదురుగావున్న బడ్డీసద్ద బీడీలు కొను క్కుండానికి వెళ్లిన దేవుడు కొట్టులో వ్రేలాడుతున్న పత్రికను చూశాడు.

"పూలన్‌దేవిని పట్టుకుంటే పదివేలు" అని చదివి పిచ్చిగా నవ్వాడు దేవుడు.

"ఏం దేవుడూ! ఎప్పుడూ నవ్వనోడు విరగబడి నవ్వుతున్నావు? ఏటి కారణం?

"ఆడదానిని మేం పట్టుకోలేం. మీరే పట్టు కోండి. దానికి బహుమతి ప్రకటించారు కూడ - అక్కడి పోలీసులు చేతకాని వాళ్లనిపించుకున్నారు."

"ఏటి సేస్తారేటి? పోలీసు బందోబస్తు లేనిచోట దోపిడీలు - అందుకే నీలాటో లెవరైనా పట్టుకుంటే పదివేలిస్తా మన్నారు. నువ్వక్కడున్నా బాగుండేది దేవుడూ! పూలన్‌దేవిని పట్టుకుంటే పది వేలు— నీ దరిద్రం తీరిపోను."

"యెంకటేసూ! నా దరిద్రం అలాగ తీరదయ్యా! కలకాలం కష్టాలకే పుడ

వారు కొందరు. అలాంటి జీవితాలో నే నొకణ్ని-బ్రతకడం కన్న చావులో ఎంత హాయి వుందనుకున్నావ్" అంటూ పాకలో దూరి చిట్టిని హాస్పిటల్‌కు తీసుకు వెళ్లడానికి భుజంమీద వేసుకున్నాడు.

ఇంతలో కాకీబాబు తయారయాడు.

"కోర్టుకి రావాలి దేవుడూ! ఇదిగో డబ్బులు."

"యీవేళ కాదండి - చిట్టికి జ్వరం - మందిప్పించాలి"

"నీ పేరుంది- తిరుగులేదు. రాకపోతే తెలుసు కదూ!"

ఆయన కండ్లలోని క్రౌర్యానికి బయపడి "అలాగేనండీ" అన్నాడు దేవుడు. జ్వరంతో కాలిపోతున్న చిట్టిని హాస్పిటల్‌కు తీసుకువెళ్లి చీటీ రాయించి ఇంజక్షన్ చేయించుకొనేసరికి పదకొండు గంటలయింది.

"కాసేపు ఆ బల్లమీద కూర్చో- ఇంజక్షన్ రియాక్షనిస్తుందేమో తెలిసి పోతుంది" అని నర్సు చెప్పింది.

కాని దేవుడు కాకీబాబు క్రౌర్యపు చూపులు గుర్తుకొచ్చాయి. "ఇంజక్షన్ పడిందిగా. ఇక పరవాలేద"నుకుంటూ చిట్టికి తుండుగుడ్డకప్పి ఆ మండుటెండలో కోర్టుకు సరాసరి వచ్చాడు. దేవుడు వచ్చి వరుసలో నిల్చోలేదని హెడ్ కానిస్టేబుల్ మండిపోతున్నాడు. "ఇదయాక వెళ్ళవచ్చు కదయ్యా? ఎండలో పిల్లను చంపడానికి కాకపోతే మ రెం దు కు" అంటుండగా చిట్టి శరీరం చల్లబడి పోవటం దేవుడు గమనించాడు. వెక్కి-వెక్కి ఏడుస్తూ "బాబూ! చిట్టి చచ్చి పోయింది. నా పేరు ముందున్నట్టు చెయ్యి" అనగానే హెడ్‌కానిస్టేబుల్ బెంచి క్లర్క్‌తో చెప్పి దేవుడి చేత జరిమానా కట్టించి పైకి పంపించాడు.

పైకి వచ్చిన దేవుడి కళ్ళు తిరిగి పోతున్నాయి.

"చిట్టి చావుకబురు నీ కెలా చెప్పేది. రంగమ్మా!" అని వరండాలో కూర్చుండి పోయాడు. కోర్టుకి వచ్చి పిలుపుకోసం ఎదురుచూస్తున్న ఓ యువకుని చేతిలోని పేపరులో వున్న పూలన్‌దేవి రేఖా చిత్రాన్ని చూశాడు.

"ఈవిడ పట్టుబడితే శిక్ష వుంటుందా బాబూ!"

"శిక్ష! అంత దమ్ములు మన వాళ్లకు లేవు. శతవిధాల ప్రార్థిస్తున్నారు తల్లీ అమ్మా లొంగిపొమ్మని - దొరికిపోయిం తర్వాత తనను గాని తన ముఠావారిని గాని తన రాష్ట్ర పోలీసుల కప్పచెప్ప కూడదట! అదుబయటు జైలు....ఏ క్లాసు సౌకర్యాలు. అన్నింటికీ ప్రభుత్వం ఊ! కొట్టక తప్పలేదు."

"మరి ఏమీ చెయ్యని నేను నెలకు రెండుమూడుసార్లు కిరాయి దొంగగా కోర్టుకొస్తున్నాను. ఈ నాడు నా భుజం మీద నా చిట్టితల్లి శవం-సరాసరి హాస్పి



టల్‌నుంచి కోర్టు కొచ్చాను" అంటూ ఉక్కిరిబిక్కిరిగా ఏడుస్తున్నాడు.

దేవుడి జాలి కథ విని ఆ యువకుడు చలించిపోయాడు.

"నేను కథకుణ్ని - నీలాంటి దౌర్భాగ్యులు చాలామందున్నారీ దేశంలో- కాస్త అవకాశమిస్తే మంచి బ్రతుకు బ్రతుకుదామని ఎందరో ఆశతో అర్రులు చాస్తున్నారు. మనిషిని మనిషిగా బ్రతక నియ్యని రోజులు" అంటూ అయిదురూపాయిలు దేవుడి చేతిలో పెట్టి "త్వరగా తీసుకుపో-చావడం చచ్చింది. తర్వాత ఎంత తంతు - జీవితాంతం మీ ఏడుపు- దహనానికి కూడ ఖర్చు" అంటూ దేవుడికి చేయూతిచ్చి లేపాడు. భారంగా అడుగులు వేసుకుంటూ పోతున్న వాడిని జాలిగా చూస్తున్నాడు. బాధల్లో వున్న వాడికి ఐదు రూపాయిలు సహాయం చేశానన్న తృప్తి పడుతున్నాడు. దేవుడన్న మాటల్ని నెమరువేసుకుంటూ పూలన్ దేవి రేఖాచిత్రాన్ని మళ్లీ చూశాడు.

"బందిపోటు దొంగతనాన్ని వృత్తిగా స్వీకరించి దానిని మరుగుపరచటానికి సంఘంలో తమకు తీరని ద్రోహం జరిగిందంటూ ప్రచారం చేసుకోవటం-అసలు వ్యక్తుల్ని శిక్షించాలి గాని అమాయకులైన నిస్సహాయులైన గ్రామప్రజల్ని దోచుకోవడం, కాల్చి చంపడం నాగరికతకు విరుద్ధమైన పనులు. ఈ ఇతివృత్తాన్ని కిరాయిదొంగల జీవితాలను నే నెందుకు కథగా మలచకూడదు" అనుకుంటున్నాడా యువకుడు....

"వెంకటేశూ! చిట్టి చచ్చిపోయింది. ....ఖాళీ కేరేజీలతో తిరిగొచ్చే రంగమ్మకి దుర్వార్త ఎలా చెప్పేది? మాకా సుఖం లేదు. పోనీ దీన్నయినా సుఖపడనీయి. అదృష్టవంతురాలు- త్వరగా పోయింది." అని పసికూనలా దేవు డేడుస్తున్నాడు.

వెంకటేశు కండ్లు చెమర్చాయి.

"ఈ అరిటిపళ్లు తిని సోడా తాగు- డబ్బు లివ్వొద్దులే" అని బలవంతంగా దేవుడి కిచ్చాడు.

చిట్టి శవాన్ని పాకలోవుంచి రంగమ్మ రాకకోసం ఎదురుచూస్తున్నాడు దేవుడు.

నాలుగు గంటల సమయం. రంగమ్మ రావటం చూశాడు. చిట్టి చావుకబురు ఎలా చెప్పటమా అని తడబడిపోతున్నాడు దేవుడు.

"దానికి జొరం తగ్గిందా? ఇంజిసనిచ్చారా? యీ ఏల ఒక బాబు పనిమద్దిలో ఇంటికెల్లిపోనారు. కేరేజీ తిరిగి తీసుకొచ్చేసినాను. సెయ్యికడుక్కో-- తిందువు గాని."

"చిట్టి చచ్చిపోయింది రంగమ్మా!" అని దేవుడు చెప్పటమే రంగమ్మ నెత్తినున్న తట్ట కేరేజీ నేల కూలిపోయాయి. విడిపోయిన గిన్నెలలోని అన్నమదీ వీధి కుక్కలు తింటున్నాయి. ఆ భార్యాభర్తల ఏడుపు విని తెలిసిన పేదవారు

గుమికూడారు. ఊరడింపు మాటలు చెపుతున్నారు.

"ఇన్నాళ్లు ముగ్గురం. యీనాట్నుంచీ ఇద్దరం దేవుడు మావా!" అని మధ్య మధ్య రంగమ్మ ఏడుస్తోంది.

"స్మశానానికి తీసుకుపోవాలంటే డబ్బుండాలి. రోడ్డు ప్రక్క గొయ్యితీసి పూడ్చండి" అని ఒక ముసలాయన సలహా ఇచ్చాడు.

"స్మశానానికి కూడ అందరి శవాల్లా గౌరవంగా పోయేరాత రాసుకోలేదు కదు చిట్టీ!" అని వ్యంగ్యంగా తనలో తానే నవ్వుకున్నాడు దేవుడు.........

"నేను మనిషిగా బ్రతుకుతాను. నా రంగమ్మకు మంచి బ్రతుకు ప్రసాదిస్తాను.... అయినా ఎలా? ఏ ఉద్యోగం చేసి? పైఊరు పారిపోతే ఎవరాదరిస్తారు" అని దేవుడు తనలో తానే సతమతమై పోతున్న సమయంలో అయనను ఓ కాకీ బాబు పలుకరించాడు.

"యీమారు పెద్దపనే నీ కప్పచెపుతున్నాను దేవుడూ, పోర్టువార్డు పోస్టాఫీసులో చిన్న దొంగతనం జరిగింది. ఏం పోలేదుగాని పైని విడిచిన బ్రాస్ తూకపురాళ్లు పోయాయి. అవి ఎలాగు దొరకవు. మళ్లీ వాటిస్థానే కొత్తవి కొన్నాం. వాటిమీద పి. ఎండ్ టి. అని చెక్కించాం. నీవే తీశానను. చిన్న శిక్ష-గవర్నమెంటు అఫీసుల కేసులు పట్టుకుంటే మాకు ప్రమోషన్."

పెద్ద కేసుల్లోకూడ ఇరికిస్తున్నందుకు దేవుడు నిలువునా నీరై పోయాడు.

కొద్ది రోజుల క్రితం పూడ్చిన చిట్టి సమాధివైపు చూశాడు. జీవచ్ఛవంలా తనవైపు చూస్తున్న రంగమ్మను చూశాడు. మనసు చిరుక్కుపోయింది.

"యీమారు జరీమానా కాదు. జైలుకి పోక తప్పదు. చుట్టుప్రక్కల బర్మా నుంచి వచ్చినవాళ్లున్నారు. వస్తువాహనాలు లేకపోయినా ఆడదానివి. జాగ్రత్తగా వుండాలి" అంటూ కాకీబాబువైపు చూశాడు.

"ఇదే నేను చేసిన అఖరు నేరం బాబూ! తర్వాత మీరు వచ్చినా నేను రాను... కారణం? నే నంటూ వుంటేగా! దేవుడంటూ వుంటేగా!"

మంత్రించినవాడిలా కాకీబాబు వెనుక నడిచి వెళ్లాడు.... ఫలితం ఆరు మాసాల కారాగార శిక్ష....

ఏకాకిగా రంగమ్మ బితుకుబితుకుమంటూ జీవితం గడుపుతోంది.........

"రంగమ్మా! ఎలాగూ ఐదు నెలలు గడిచిపోయాయి. మరో నెల రోజులేగా! దేవుడు తిరిగొచ్చేస్తాడు. అక్కడ ఒంటరిగా పడుకునేకన్న రాత్రిపూట ఇక్కడ వరండాలో కాలక్షేపం చెయ్యి" అని ఆ నలుగురు విద్యార్థులూ తమ అభిప్రాయం వెల్లడిచేశారు.

రంగమ్మ ఆ నలుగురి వైపు తేరిపార చూసింది.





"నెల రోజులేగా బాబూ!"

"పరవాలేదు. సెలవల్లో ఇంటికి పోతాంగా! యీ నాలుగు రోజులూ ఇక్కడే వుండు" అని రంగమ్మ కండ్లలోనికి ఆ నలుగురు విద్యార్థులూ చంటి పాపల్లా చూశారు.

కాదనలేకపోయింది రంగమ్మ. పాకలోని సామాన్లకు తడకడ్డుపెట్టింది. అక్కడే కడుపు నింపుకుని పది రోజులు కాలక్షేపం చేసింది. ఇంతలో ఒక బర్మా కాందిశీకుడు రంగమ్మను వెతుక్కుంటూ వచ్చాడు.

"ఇక్కడఉే వున్నావు రంగమ్మా! పాకలోని సామాన్లు ఎవరో ఎత్తుకుపోయారు. దేవుడక్కడ—నువ్విక్కడ. సామాన్ల గురించి పోలీసులకు కంప్లెయింటు ఇద్దాం రా! ఇక్కడుంటే పాక కూడ పీక్కుపోతారు. రాత్రిపూట అక్కడే పడుకుందువుగాని. నేను నీకు తోడుంటాను."

"యీ ఐదుమాసాలు మీవోలు కత్తులు సూపి బెదిరించి ఒల్లు సెరిపేసినారు మావా! జబ్బులంటించేసినారు."

"ఒల్లు చెడిపోయిందా! ముందు జబ్బులు— సవాయి జబ్బులు — ఇక్కడే వుండు రంగమ్మా! ముందు చెప్పడం మంచిదయింది. యీ రూపాయి తీసుకో! ఏదైనా కొనుక్కో" అని మెల్లగా జారుకున్నాడు.........

"కేరేజీలు తీసుకురానా బాబూ!"

"వద్దే రంగమ్మా! నలుగురికీ ఒకేలా జ్వరం. చపాతీలు తీసుకురా! యీ వేళ ఆదివారం — మా స్నేహితుడు కూడ రావచ్చు."

"అలాగే బాబూ!" అంటూ ముసి ముసి నవ్వుల్తో కేరేజీ చేతపట్టుకుని బయలుదేరింది రంగమ్మ.

కాసేపటిలో వాళ్ల విద్యార్థినాయకుడు మరో ఇద్దరు స్నేహితులతో వచ్చాడు.

"ఆదివారం — అందరూ ముసుగులు పెట్టి పడుకున్నారే?"

ఎవరూ ఏ సమాధానమూ చెప్పలేక పోతున్నారు.

చలిజ్వరంతో వణికిపోతున్నారు.

"ఏమయిందిరా?" అంటూ వాళ్ల శరీరాలను తాకిచూశారు స్నేహితులు.

"జ్వరంరా రవీ! అందరికి ఒకేమారు రావాలా? ఒకరికొస్తే తక్కినవాళ్లు సేవ చెయ్యొచ్చుగాని అందరికీ ఒకేమారు వస్తే చేసేదేముంది"

"రంగమ్మ వుండబట్టి గాని లేకపోతే మా గతి అంతేరా! గ్రామాల్లో వున్న అమ్మానాన్నలు గుర్తుకొస్తున్నారు"

"ఇంతకు ఇది మామూలు జ్వరమా? లేక విష జ్వరమా?"

"ఎవరైనా డాక్టరుకి చూపించాలిరా! లేకపోతే తిరిగి ఇంటికిపోలేం ...బాధగా వుంది." అంటుండగా రంగమ్మ కేరేజీతో తిరిగివచ్చింది.

అందరకూ వడ్డించింది.

కొత్తవారు రంగమ్మ వైపు అదోలా చూస్తున్నారు గాని ఆ నలుగురు మాత్రం ముఖం పైకెత్తి చూడలేకపోతున్నారు.

ప్లేట్లు కడిగి మిగిలిన చపాతీలను వరండాలో తింటూ కొద్ది రోజుల్లో తిరిగి రాబోయే భర్తను– మరి కొద్దిరోజుల్లోనే ఎవరిండ్లకు వారు పోతే ఖాళీఅయిపోయే కేరేజీ తగ్గిన రాబడి తన కడుపు ఆకలి అన్నీ ఒకేమారు తలచుకుని బెంగ పడిపోతోంది రంగమ్మ.

మాటల మధ్య ముకుందం స్నేహితుడి సహాయంతో పాస్‌కని నెమ్మదిగా లేచాడు. అతి నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ యూరినల్‌కి వెళ్లాడు.

"అబ్బ! పాస్ .... పొయ్యలేక పోతున్నానురా! యీ తొడలమీద గడ్డలు చూడండి."

"ఇందుకా మీకు జ్వరం? అందరికీ ఇవే జబ్బులా."

"అవున్రా! కళ్లు కనిపించక మేమే కోరి తెచ్చుకున్నాం...."


"ఇంతకూ ఎవరది?"

"ఆ పైనున్న రంగమ్మ."

సెక్రటరీ నిశ్చేష్టుడైపోయాడు.

"మీకన్న పెద్దది. బుద్ధిచెప్పవలసింది. తప్పు త్రోవ త్రొక్కిందన్నమాట" అంటూ పైకివెళ్లి రంగమ్మను జుత్తుపట్టి పైకెత్తి నిల్చోబెట్టాడు.

"ఏటయింది బాబూ! ఏటయింది?"




"బంగారంలాంటి వాళ్ల నలుగురి శరీరాలు కుళ్లిపోయాయే! వాళ్లకు ముండ జబ్బు తగిలించావు. నీకేం! నేరం నాది కాదు ఆకలిదంటావు– ఆకలి తీరకపోతే చచ్చిపో. దొంగతనం చెయ్యి. యాచించు– శరీరాన్ని పాడుచేసుకుని ఆ పాపాన్ని సంఘానికి రుద్దే అధికారం నీకెవరిచ్చారు? సరైన సమాధానం చెప్పక పోయావో నిన్నీ గదిలో బంధించి దాహం దాహమని అరిచినా సరే విడవకుండా చంపేస్తాం. నీలాంటి వాళ్లు బ్రతుక్కూడదు రంగమ్మా! ముక్కుపచ్చలారని కుర్రాళ్లు వాళ్ల తలితండ్రులు వాళ్లకోసం వాళ్ల భవిష్యత్తుకోసం ఎంత ఆత్రుతగా ఎదురుచూస్తుంటారో తెలుసా? అందరికీ తెలిస్తే వాళ్లు తలెత్తుకు తిరగలేరు. రహస్యంగా వైద్యం చేయించాలి."

రంగమ్మ దుఃఖంతో "బాబూ! ఏటి సేసేది? మా మగోడ్ని సెయ్యని నేరానికి జైల్లో పెట్నారు.... ఒక్కత్తే కూతురు– చిట్టి– సచ్చిపోయింది. పగలు కేరేజీల పని సూసుకోని ఒక్కదాన్నే పాకలో తొంగుండేదాన్ని. బర్మా నుంచొచ్చినోలు– కత్తులు సూపించి సెరిసినారు. ఆళ్లకున్న జబ్బులన్నీ నా కంటుకున్నాయి. యీ బాబులికి ఏం బుద్ధిపుట్టిందో ఏటో ఇక్కడే పడుకోమన్నారు. తిండెట్నారు. రెండు తెల్లసీర్లు కొన్నారు. ఆకలి తీరిపోతంది. అదే అనుకున్నాను గాని ఇదంతా ఆలోసించలేకపోయినాను. ఇంకెందుకు బాబూ యీ బతుకు? నేనే సస్తాను."

"తప్పించుకుందామని చూస్తున్నావు కదూ!"

"లేదు బాబూ! ఆ తాడు దూలానికి కట్టండి. మెడెట్టి ఉరితీసుకుంటాను."

"ఆ నేరం మా మీద పడితేనో!" అంటూ రంగమ్మను గదిలోకి నెట్టాడు.

ఆ రోజే సెంట్రల్ జైలునుంచి దేవుడు మంచి ప్రవర్తనవలన పదిహేను రోజుల ముందుగానే విడుదలయాడు. తిరిగి తన బట్టలు కట్టుకున్నాడు. గేటు దగ్గరినుంచే మళ్లీ కుళ్లిన ప్రపంచాన్ని చూశాడు.

"బాబూ! తూకపురాళ్లు. న్యాయానికి ప్రతిరూపాలు. మరి నా విషయంలో తూకపురాళ్లు- చాల న్యాయం చేశాయి బాబూ!.... నేనంటూ బ్రతికుంటే మళ్లీ చేయని నేరానికి జైలుకు రమ్మన్నా రాను. తిన్నగా సమాధికి. ఏ ఒక్కరికీ పని కల్పించటం నా కిష్టంలేదు బాబూ!"

"వెళ్లవయ్యా! నీలాంటి ధర్మ సూత్రాలు పలికినవారంతా మర్నాడే తిరిగొచ్చేస్తున్నారు- నీవేం? సత్య హరిశ్చంద్రుడవా" అని దేవుడ్ని పైకి, పంపించారు....

పరుగు నడకల మీద దేవుడు వెంకటేశుకొట్టు చేరుకున్నాడు. తర్వాత దబ్బులిస్తానని షోడా కొట్టించుకు త్రాగాడు.

"మా రంగమ్మ- పాకలో వుందా?"

"అక్కడ పాక లేదు దేవుడూ! సేతికి దొరికిన కమ్మలు బొయిలోకి పీక్కు- పోయారు- ఆ స్టూడెంటు బాబుల్దగ్గరున్నాని మొన్న కనబడి చెప్పింది."

దేవు డక్కడికి వెళ్లి "రంగమ్మా! రంగమ్మా" అని పిలిచాడు.

ఏ ఒక్కరూ నోరు మెదపడంలేదు.

"ఏమయింది బాబూ! ఏమయింది? నా రంగమ్మెక్కడ లేదూ!"

"ఆ గదిలో వుంది. దానిని తాకకు- పాపం- తనకున్న జబ్బులన్నీ యీ నలుగురికీ అంటించింది."

"జబ్బులు.... దాని కెక్కడివి బాబూ జబ్బులు? నే లేనప్పుడు వ్యభిచారానికి దిగిందా?" అంటూ గదిలో దూరాడు.

రంగమ్మ భర్త వైపు అమాయకంగా చూసింది. ఆ చూపులో క్షమించమన్న ప్రార్థన లేదు. చంపమన్న పిలుపు వుంది.

"దానిని చంపకు దేవుడూ! చంపి ఆ నేరం మామీద నెట్టకు."

"అంత నీచుడ్ని కాదు బాబూ! దీనిని మీ సమక్షంలోనే పీకనులిమి చంపి దాని శవాన్ని పోలీసుస్టేషన్‌కు తీసుకుపోతాను బాబూ! ఆరోగ్యంగా వున్నవారికి జబ్బు లంటించే అధికారం దీని కెవరిచ్చారని మా రంగమ్మ నడుగుతున్నాను."

"ఆ బర్మానుంచొచ్చినోలు- కత్తులు సూపించి సెరిసినారు. ఎవుడితో సెప్పుకోను. ఐదునెల్లూ అలాగ్గడిసిపోయినాయి. నెల్రోజులుందనగా యీ బాబులిక్కడికి పిలిసినారు, ఎలాగా సెడిపోయిందాన్ని. ఆకలి గూడు తెల్లగుడ్డలు.... తలొంచీసినాను. అందరికీ నా జబ్బులంటుకున్నాయి. జొరంతో బాధపడతన్నారు."

"ఎంత పనిచేశావు రంగమ్మా! దేవుడి భార్య రంగమ్మ దేవుడి సమక్షం చేరుకోవాలి. మా కన్యాయం జరిగిందని పూలన్‌దేవిలా యుద్ధం చేయలేను. సంఘంమీద కాదు నా కక్ష. నా మీద నాకు కసి- నా దరిద్రం మీద నాకు క్రోధం- అందుకే విన్నంతం చేస్తున్నా రంగమ్మా!" అని పీక నులిమాడు.

విలవిలమంటూ ప్రాణాలు పోగొట్టుకుంటున్న రంగమ్మను చూసి ఆ నలుగురు విద్యార్థులూ తల్లికోసం పసిపిల్లల్లా ఏడుస్తున్నారు.

"మీ గౌరవాన్ని మీరు కాపాడుకోండి. రహస్యంగా వైద్యం చేయించుకోండి. యీ విషయం మరెక్కడా ఎత్తకూడదు. నేనంటూ బ్రతికుంటే మిమ్మల్ని కోర్టులకు లాగవలసి వస్తుంది. యీ రోత బ్రతుకు లంతంకావాలి. అందుకే ఓ పదునైన చాకు కావాలి బాబూ" అని బలవంతంగా తీసుకుని భార్య శవాన్ని భుజాన వేసుకుని గంభీరమూర్తిలా పోలీసు స్టేషన్‌కు బయలుదేరి వెళ్లాడు.

దేవుడి చేతిలోని చాకును చూసి వెనుక నడుస్తున్న జనం దూరంగానే నడిచి వస్తున్నారు.

రంగమ్మ శవాన్ని పోలీసు స్టేషన్ వరండాలో దించాడు.

"నేను బాబూ దేవుడ్ని. పూలన్ దేవుడ్ని- నా నేరాలను తూకపురాళ్లతో తూచి దానికి తగిన శిక్ష విధించారే ఆ దేవుడ్ని బాబూ! మళ్లీ జైలుకుగాని మీకుగాని పని కల్పించకుండా నా భార్యను నేను చంపి తీసుకొచ్చాను బాబూ! దీని జబ్బులు దేశానికి అంటగడుతోంది. దీని కెవరిచ్చారా అధికారం? దీని జబ్బులకు ఎందరో కారకులు. పూలన్‌దేవిలా ఏ అడవులకు పారిపోయి వాళ్లమీద కక్ష తీర్చుకునేది బాబూ!- అదికాదు యీ రోజుల నీతి- దాని నాశనానికి ఎవరు కారకులైనా అది మాత్రం పదిమంది నాశనానికి కారకురాలు కాకూడదన్న నీతి నియమాలతో పూలన్‌దేవుడిగా మారి నా భార్యను నేను చంపాను బాబూ! ఈ పని నేను పేరొస్తుందని చెయ్యలేదు. దేశం ఆరోగ్యంగా వుండాలి బాబూ! ప్రతి పేదవాడు ఇలానే చచ్చి దేశాన్ని ధనవంతుల భోగభాగ్యాలతో నవ్వు ముఖాలతో కళకళలాడేలా చేయాలి బాబూ" అంటూ చేతిలోని చాకుతో పలుమార్లు పొడుచుకుని నేలకొరిగాడు దేవుడు- పూలన్‌దేవుడు.